సాక్షి ఒడిశా
సోమవారం । 18 । ఆగస్టు । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 9,79,737
బంగారం : 85 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
వెండి : 51 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

'ఆ మో సాథి ఆ' వీడియో విడుదల

జయపురం: వీరజవానుల సతీమణుల వేదనపై 'ఆ మోసాథి ఆ' అనే దేశ భక్తి గీతాల వీడియోను శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. స్థానిక కరసుధా టాకీసులో కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్ నరశింహ నాయిక్ ధర్మపత్ని ఆ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోను మాజీ సైనికుడు భోలానాథ్ దేవనాథ్ అతని భార్య శుక్ల దేవాసీలు యుట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. పాటలను ప్రముఖ సంగీత కళాకారుడు ధీరెన్ మోహన్ సట్నాయిక్ రచించి స్వరకల్పన చేశారు. ప్రముఖ గాయని శ్రీమతి నందిత భంజ మృదు మధురంగా పాడారు. సుభద్ర రౌత్‌రాయ్,పియూసీ పట్నాయిక్ వీడియో రికార్డింగ్, మిక్సింగ్ చేశారు. పాటలకు మహేశ్వర నాయిక్,ఈశ్వర సారంగీ,రాహుల్‌దేవ్ సామంతరాయ్,శుకమన్ సాగొడియ,ఉమేష్ పాణిగ్రహిలు యంత్ర వాయిద్యాలతో సహకరించారు. పాటల వీడియోలో దిలీప్ నాయిక్,కావేరీ మిశ్రలు అభినయించారు. ఈ వీడియో కు మహమ్మద్ షరీఫ్ ప్రధాన దర్శకులుగాను, శ్రీకాంత దాస్, యంతి దాస్‌లు సహాయ దర్శకులుగాను వ్యవహరించారు.

బాధితురాలి వాంగ్మూలం..
వీడియో దుమారం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేడీ నాయకుడు లెనిన్ మహంతి

- భగ్గుమన్న విపక్షం
- ప్రామాణికత ధ్రువీకరణకు పోలీసుల కసరత్తు

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమాపడా నియోజక వర్గం బొలొంగా ప్రాంతంలో అగ్నికి ఆహుతైన బాధితురాలి వాంగ్మూలం వీడియో ప్రసారం దుమారం రేపింది. బాలిక మరణంపై సందిగ్ధత తొలగని పరిస్థితుల్లో ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న దశలో రికార్డు చేసిన వీడియో ప్రసారం కావడం కలకలం రేపింది. ఈ ప్రసారంపై విపక్ష బిజూ జనతా దళ్ భగ్గుమంది. న్యూ ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు ఒక మహిళా అధికారి బాధిత బాలిక వాంగ్మూలాన్ని రికార్డ్ చేస్తున్నట్లు చూపించే వీడియో ప్రసారం జరిగింది. ఈ ప్రసారంతో తెర వెనక బాగోతం బట్టబయలైందని ఉభయ విపక్షాలు బీజేడీ, కాంగ్రెస్ సహా రాష్ట్రంలోని పలు రాజకీయ వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

ఉప ముఖ్యమంత్రి రాజీనామాకు డిమాండు

ఉప ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది. అగ్నికి ఆహుతి అయిన బాధితురాలు బలహీన వర్గానికి చెందిన బాలిక. ఆమెను సజీవ దహనం చేశారని లెనిన్ మహంతి ఆరోపించారు. విపక్షం ఒత్తిడితో బాధిత బాలికను చికిత్స కోసం భువనేశ్వర్ నుండి ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ వరుసగా 3 సార్లు బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం ఇలా జరిగిందని నిలదీశారు. న్యాయమూర్తి సమక్షంలో ఎన్నిసార్లు వాంగ్మూలం నమోదు చేశారన్నారు. బాలిక మరణించిన 10 నిముషాల తర్వాత పోలీసులు మరణ సమాచారం ట్వీట్ చేశారు. మరో వైపు పోలీసులు అత్యంత నిజాయితీతో దర్యాప్తు నిర్వహించారని, వేరెవరి ప్రమేయం లేదని ట్విట్టర్‌లో ప్రసారం చేశారు. ఈ చోద్యం గతంలో ఎన్నడు చవి చూడలేదని వ్యాఖ్యానించారు. బాధితురాలు మరణించిన 15 రోజుల తర్వాత ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన వీడియో వైరల్ అవుతోంది. ఇది అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ వీడియోలో న్యాయమూర్తి అక్కడ ఉన్నారో లేదో అనే అస్పష్టత సందిగ్ధత ఉందని లెనిన్ మహంతి పేర్కొన్నారు. దీనిపై ఆరా తీసి వీడియో దుమారంపై పోలీసులకు కచ్చితత్వం చాటుకోవాలన్నారు. దీనిపై రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం వివరణ వెల్లడించాలని కోరుతున్నాయి. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వీడియో ప్రసారం చేసిన వారిని గుర్తించిన మేరకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని భారతీయ జనతా పార్టీ స్పష్టం చేసింది.

వీడియో ప్రామాణికత ధ్రువీకరిస్తాం: ఎస్పీ

ఆస్పత్రిలో బొలొంగా బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేస్తున్న వైరల్ వీడియో యొక్క ప్రామాణికతను ధ్రువీకరించనున్నట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) పినాక్ మిశ్రా ఆదివారం తెలిపారు. వీడియోను వైరల్ చేసిన వ్యక్తులపై దర్యాప్తు కోసం సైబర్ బృందం సహకారం తీసుకుని వీడియో క్లిప్ ప్రామాణికతను ధ్రువీకరిస్తామని మీడియాకు వివరించారు. ఈ ప్రసారం జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 74 ఉల్లంఘనగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చివరి దశకు చేరుకుంది. చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ముందు నమోదు చేశారు. ఈ విషయంలో బాధితురాలి కుటుంబం, బంధువులకు కూడా సమాచారం అందజేయడం జరిగిందన్నారు. మరికొన్ని ఫోరెన్సిక్ వైద్య నివేదికలు అందాల్సి ఉంది. దర్యాప్తు పూర్తి కావడంతో సమగ్ర సమాచారాన్ని కోర్టుకు దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

• ప్రగతికి రెక్కలు


జెండా ఊపి భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య ప్రత్యక్ష విమాన సేవలు ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

- భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య ప్రత్యక్ష విమాన సేవలు ప్రారంభం


తొలి టికెట్ విడుదల చేసిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


తొలి ప్రయాణికులకు ముఖ్యమంత్రి అభివాదం

భువనేశ్వర్: ప్రాంతీయ అనుసంధానం, సమ్మిళిత వృద్ధిని పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య ప్రత్యక్ష విమాన సేవలను లాంఛనంగా ప్రారంభించింది. రాష్ట్ర మార్గదర్శక ఏవియేషన్ ఆస్తులు, నెట్‌వర్క్ నిర్మాణం, నిర్వహణ (బి-మాన్) పథకం కింద ఈ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించారు. ఈ నెల 24 నుంచి పూర్తి స్థాయిలో ఈ సేవలు లభ్యమవుతాయి. వారానికి 4 రోజులు మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారం భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య 76 సీట్ల ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులో ఉంటుంది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి జెండా ఊపి ఈ సేవల్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ సేవలకు కొత్త గమ్యస్థాన విధానం కింద వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) ద్వారా మద్దతు లభిస్తుందన్నారు. భువనేశ్వర్, ఝార్సుగుడ మధ్య ప్రత్యక్ష విమాన సేవలు పశ్చిమ ఒడిశాను రాష్ట్ర రాజధానికి దగ్గరగా తీసుకురావడంతో పారిశ్రామిక వృద్ధి, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి, సామాజిక, ఆర్థిక పురోగతికి గణనీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. అందరి విమానయానం కలను సాకారం చేసేదుకు రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ ప్రాంతీయ వాయు నెట్‌వర్క్‌లను విస్తరణతో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో నిబద్ధతను పునరుద్ఘాటించిందన్నారు.

న్యూస్‌రీల్

నవీన్ పట్నాయక్‌కు అస్వస్థత

భువనేశ్వర్: రాష్ట్ర ప్రతిపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

నవీన్ పట్నాయక్‌కు మంత్రి పరామర్శ

భువనేశ్వర్: ఆస్పత్రిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో సంప్రదించి చికిత్స, వైద్యం, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అవసరమైతే విపక్ష నేత చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని మంత్రి ప్రకటించారు.

చికిత్సకు స్పందిస్తున్నారు..

నవీన్ పట్నాయక్ ఆదివారం సాయంత్రం 5.15 గంటలకు డీహైడ్రేషన్ కారణంగా స్థానిక సమ్ అల్టిమేట్ మెడికేర్‌లో చేరారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. చికిత్సకు బాగా స్పందిస్తున్నారని ఆస్పత్రి వర్గాలు సమాచారం జారీ చేశాయి.

హోంగార్డు అభ్యర్థుల ఆందోళన


జిల్లా పోలీసు కార్యాలయం వద్ద హోంగార్డు నిరుద్యోగుల నిరసన

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో హోంగార్డు పోస్టులకు ఇటీవల శారీరిక, రాత పరీక్షలు జరిగి ఫలితాలను జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా శనివారం ప్రకటించారు. మొత్తం 144 పోస్టులకు 128 మంది జాబితా విడుదల చేశారు. కొంత మంది పరుగుపందెం పోటీలో అర్హత సాధించలేని అభ్యర్థులు కూడా జాబితాలో ఉన్నాయని, ఈ హోంగార్డు నియామకాల్లో అవకతవకలు జరిగాయన్నారు. బెత్తగుడ వద్ద జిల్లా పోలీసు బారక్ వద్ద ఆదివారం కొందరు నిరసన తెలిపారు. ఫలితాలు ప్రకటించిన తరువాత అభ్యర్థులు అభ్యంతరం లేవనెత్తడం ఏమిటని పోలీసు అధికారులు చెబుతున్నారు.

బైకు దొంగలు అరెస్టు


అరెస్టయిన దొంగలు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసు సిబ్బంది

రాయగడ: జిల్లాలోని శశిఖాల్ పోలీసులు బైకుల దొంగతనం కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఇద్దరు మైనర్లు ఉండగా మరో ఇద్దరు యువకులు స్థానిక రెల్లివీధికి చెందిన అడప నిఖిల్, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లా పార్వతీపురం మండలం గుమడ గ్రామానికి చెందిన కుప్పిలి శేఖర్‌లు ఉన్నారు. వారి నుంచి రెండు బైకులు, ఒక స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టుకు తరలించారు.

సుదర్శన్ కళా గ్రామం సందర్శన


గవర్నర్‌కు కోణార్కు చక్రం శిల్ప నైపుణ్యత వివరిస్తున్న పద్మ విభూషణ్ సుదర్శన్ సాహు


శిల్ప కళాకృతులను తిలకిస్తున్న గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి


కళా ప్రతిబింబాల సందర్శనలో గవర్నర్


చక్ర శిల్పం తిలకిస్తున్న గవర్నర్ దంపతులు

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సతీమణితో కలిసి ఆదివారం స్థానిక సుదర్శన్ ఆర్ట్ అండ్ క్రాఫ్టు గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామం వ్యవస్థాపకుడు పద్మ విభూషణ్ సుదర్శన్ సాహు అక్కడి శిల్పాల కళాత్మక ప్రక్రియను గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రానికి ప్రపంచ గుర్తింపును తెచ్చి పెట్టిన శిల్పాల ఆవిష్కరణ వెనుక ఇమిడి ఉన్న కళాత్మక మెలుకువల్ని సవివరంగా తెలియజేశారు. సృజనాత్మకత ప్రతిబింబించే కళాఖండాలు శిల్పి ఖచ్చితత్వానికి అద్దం పడుతున్నాయని గవర్నర్ ప్రశంసించారు. ఈ కళాఖండాలు ఒడిశా శతాబ్దాల నాటి కళాత్మక సంప్రదాయ వారసత్వానికి సజీవ సాక్షిగా పేర్కొన్నారు. ఒడిశా కళలు, సంస్కృతికి నిలయంగా గవర్నరు అభివర్ణించారు. ఈ అద్భుతమైన వారసత్వాన్ని భావి తరాలకు అందజేసి యువ కళాకారులను ప్రోత్సహించాలన్నారు.

5 జిల్లాల్లో త్వరలో 500 మంది ట్రాఫిక్ వార్డెన్ల నియామకం



డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా అధ్యక్షతన రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: జిల్లా స్థాయి రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా అధ్యక్షతన రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర రవాణా అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనల అమలు కట్టుదిట్టం, నిరవధిక జాతీయ రహదారి పహరా, సీసీటీవీ తనిఖీ, అవగాహన కార్యక్రమాలు, పాఠశాల, కళాశాల స్థాయిలో రోడ్డు భద్రతా విద్య వంటి అంశాలపై వివరంగా చర్చించారు. రాష్ట్రంలోని కెంజొహర్, మయూర్ భంజ్, సుందర్‌గఢ్, గంజాం, ఖుర్ధా జిల్లాల్లో ప్రమాదాల రేటు పెరుగుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ జిల్లాల్లో త్వరలో 500 మంది ట్రాఫిక్ వార్డెన్లను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు వారికి ట్రాఫిక్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తారని డీజీపీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్లను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల సామాన్యులు ప్రమాదాల బారిన పడకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. ప్రమాదాలలో సామాన్యుల ప్రాణ నష్టాన్ని నివారించడానికి ఉమ్మడి ప్రయత్నాలు చేయాలని జిల్లాలోని ఆర్టీఓ, పోలీసులు మరియు ఇతర శాఖ ఉద్యోగులకు డీజీపీ సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం, జాతీయ రహదారులపై నిరవధిక పహరా, కాలి నడక వంతెనలు మరియు భూగర్భ మార్గాల వినియోగం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడం, మద్యం తాగిన డ్రైవర్లపై చర్యలు, సీటు బెల్టులు మరియు హెల్మెట్లు ధరించడం, జాతీయ రహదారుల పక్కన నిలిపి ఉంచిన భారీ వాహనాలపై కఠిన చర్యలు, జాతీయ రహదారులపై ప్రమాద మరణాలను తగ్గించడానికి అంబులెన్స్‌ల మోహరింపు వంటి అంశాలపై వివరంగా చర్చించారు. సమావేశంలో అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ అరుణ్ బోత్రా, రాష్ట్ర రవాణా కమిషనర్ అమితాబ్ ఠాకూర్, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్, రాష్ట్ర రవాణా అథారిటీ అధికారులు పాల్గొన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ (సెంట్రల్) ఎస్. ప్రవీణ్ కుమార్, ఇన్స్పెక్టర్ జనరల్ (దక్షిణ) నితీష్ శేఖర్, డీఐజీ (తూర్పు) డాక్టర్ సత్యజిత్ నాయక్, డీఐజీ (పశ్చిమ) బ్రిజేష్ కుమార్ రాయ్, అన్ని జిల్లాల పోలీసు సూపరింటెండెంట్లు వర్చువల్ మాధ్యమం ద్వారా సమావేశంలో పాలుపంచుకున్నారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి

- సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న
- రాయగడలో ఘనంగా నందోత్సవాలు


చిన్నారులతో నిర్వాహకులు


ప్రసంగిస్తున్న సబ్ కలెక్టర్ జెన్న



రాయగడ: చిన్నారుల్లో ఆధ్యాత్మికత పెంపొందించేలా సామాజిక, సేవా సంస్థలు నడుం బిగించాలని రాయగడ సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో క్లబ్ ద యంగ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన నందోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైందవ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఇటువంటి తరహా కార్యక్రమాలను చేపట్టి చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనను కలిగిస్తున్నందుకు అభినందనీయమన్నారు. చిన్నారులు వారి చదువుల్లో నిమగ్నమవుతూ మన హైందవ సంప్రదాయాలు, సంస్కృతులకు దూరంగా ఉంటున్నారన్నారు. దీంతో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. క్లబ్ ది యంగ్ ఇండియా అధ్యక్షులు సురేంద్ర ప్రసాద్ సాహు మాట్లాడుతూ.. ఏటా తమ క్లబ్ ద్వారా నందోత్సవాలను నిర్వహిస్తుండగా.. చిన్నారులు ఆసక్తితో పాల్గొంటున్నారని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో పాటు ప్రజల్లో సామాజిక చైతన్యం, సేవా కార్యక్రమాలను క్లబ్ నిర్వహిస్తుందని వివరించారు. రెండు దశాబ్దాలకుపైగా క్లబ్ తమ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటుందని అన్నారు. క్లబ్ సాధారణ కార్యదర్శి దీపక్ కుమార్ పుష్టి క్లబ్ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. 36 మంది చిన్నారులు నందోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీకృష్ణ వేషధారాణ పోటీల్లో పాల్గొన్నారన్నారు.

విజేతలు వీరే..

సరోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో స్వీకృతి ఆచార్య ప్రథమ బహుమతిని గెలుపొందగా దేవాన్షి బక్షీపాత్రో ద్వితీయ, మోక్షిత బెహర తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. పది మందికి ప్రోత్సాహక బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

గోపాల సమాజ్ సేవలు చిరస్మరణీయం


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి


వృద్ధురాలిని సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: గోపాల సమాజ్ సమాజానికి అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం స్థానిక టౌన్ హాలు ప్రాంగణంలో కొరాపుట్ జిల్లా క్షొహల్‌ఖండ్ గోపాల్ సమాజ్ నిర్వహించిన నందోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యవక్తగా పాల్గొన్న సాహితీవేత్త డాక్టర్ సురేష్ దాస్ మాట్లాడుతూ గోపాల జాతిలో అనేక మంది మహానుభావులు ఉన్నారని తెలిపారు. కవిరాజ్ పరమేశ్వర పాత్రో అధ్యక్షతన జరిగిన నందోత్సవ కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా యాదవ మహాసభ అధ్యక్షులు మదన మోహన నాయిక్, మాజీ కౌన్సిలర్ బినోద్ మహాపాత్రో, బీజేడీ నేత బాలారాయ్, జయపురం సాహితీ పరిషత్ అధ్యక్షులు హర హర కరసుధా పట్నాయిక్ తదితరులు ప్రసంగించారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం


రక్తదానశిబిరంలో వైద్య సిబ్బంది


రక్తదాన శిబిరంలో జాగో సభ్యులు

పర్లాకిమిడి: రక్తదానం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారమౌతామని వక్తలు అన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని నవోదయ విద్యాలయం పూర్వపు విద్యార్థుల (జాగో) సంఘం అధ్యక్షులు నూకల వెంకటేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు వద్ద ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 మంది రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమానికి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సంతును పాఢి హాజరయ్యారు. మొత్తం 17 యూనిట్ల రక్తం సేకరించి బ్లడ్ బ్యాంకు అందజేశారు. సీనియర్ ఫార్మసిస్టు జుధిస్టర బెహేరా, ఇతర సిబ్బంది సహకారం అందించగా.. జాగో ఉపాధ్యక్షులు మనోజ్ పట్నాయక్, అభిరాం మండళ్, సాయిరాం పట్నాయక్ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధిలోగల జయపురం సమితి కెవిడి గ్రామంలో 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు శనివార రాత్రి బొరిగుమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. గురువారం సాయంత్రం ఆ గ్రామంలో ముగ్గురు బాలికలు గ్రామ సమీప చెరువుకు వెళ్లారు. మార్గంలో కెవిడి గ్రామానికి చెందిన సాన కులదీప్ అనే యువకుడు వారిని అడ్డగించాడు. ఇద్దరు బాలికలను చంపుతానని భయ పెట్టంతో వారు పారిపోగా మరో బాలికను బలవంతంగా తీసుకు పోయి అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గ్రామ పెద్దలతో చర్చించిన తర్వాత పోలీసు స్టేషన్‌లో గత రాత్రి 9 గంటల సమయంలో ఫిర్యాదు చేశారు. బొరిగుమ్మ పోలీసులు కేసు నమోదు చేశారని, కెవిడి గ్రామం వెళ్లి దర్యాప్తు ప్రారంభించామని బొరిగుమ్మ ఏఎస్ఐ రొచిత మడకామి వెల్లడించారు.

క్లుప్తంగా

కర్మయోగి పాఠాలపై ఒత్తిడి తగదు


మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

పొందూరు: గత మే నుంచి ఐగాట్ కర్మయోగి పాఠాలు వీక్షించి తీరాలని ఉపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి తేవడం సమంజసం కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అన్నారు. పొందూరులోని డీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీడియోలు వీక్షించి ఎసెస్మెంట్‌లను పూర్తి చేసి సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, తొలుత నాలుగు పాఠాలని చెప్పి ప్రస్తుతం సుమారు 20 పాఠాలు వినాలని కలెక్టర్ కార్యాలయం నుంచి సందేశాలు పంపుతున్నారని తెలిపారు. 6 పాఠాలకు మించని ఉపాధ్యాయుల పేర్లను వాట్సాప్‌లో పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇంత వరకు ఏ ఒక్క అధికారి ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి? ఎందుకు ఇందులో వీడియో పాఠాలు వినాలి? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఒక్క పాఠం పది నిమిషాలు వినేసరికే 2జీబీ ఇంటర్నెట్ అయిపోతుందని, రోజంతా యాప్‌ల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి తీసుకొస్తూ ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే అవకాశం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు.

యువకుడిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు మోసం చేశాడంటూ మోపసుబందరు గ్రామానికి చెందిన ఓ యువతి శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోపసుబందరు గ్రామానికి చెందిన యువతి సరసన్నపేట మండలం ఊటపేటలోని తాతయ్య ఇంటి వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదివింది. ఆ సమయంలో పక్క గ్రామమైన మునిడిగట్టుకు చెందిన సింహాద్రితో పరిచయం ఏర్పడింది. ఇంటర్ పూర్తయ్యాక కూడా ప్రేమ కొనసాగించారు. కొన్ని నెలల క్రితం సింహాద్రికి ఉద్యోగం రావడంతో పెళ్లి ప్రస్తావన తీసుకురాగా నిరాకరించడంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ రాము ఆదివారం కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య


పేడాడ అప్పలనాయుడు (ఫైల్)

పొందూరు: కనిమెట్ట పంచాయతీ రాందాసుపురం గ్రామానికి చెందిన పేడాడ అప్పలనాయుడు(60) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు భార్య అప్పలనరసమ్మతో కలిసి హైదరాబాద్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసయ్యాడు. వారం కిందట గ్రామానికి వచ్చి మద్యం తాగుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. హైదరాబాద్ వచ్చేయాలని భార్య చెప్పినా వినకుండా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటి ముందు తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

పలాస : పలాస సూదికొండ కాలనీకి చెందిన ఓ జీడి కార్మికురాలు ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. తాను పనిచేసే జీడిపిక్కల బట్టీలో గుమస్తాగా పనిచేసిన పలాస అన్నపూర్ణాశ్రమ వీధికి చెందిన జామి నరేష్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా నమ్మించి మోసం చేస్తున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని కోరింది.

సందడే.. సందడి


శ్రీకరణం వీధిలో రాధాకృష్ణమందిరంలో జన్మాష్టమి వేడుకలు


నాయుడు వీధి వద్ద శ్రీకృష్ణుని దోలి ఆటలుకు సిద్ధం చేసిన దృశ్యం


నాయుడు వీధి వద్ద చల్లపిడతలు సంబరాలకు రెడీగా ఉన్న యువకులు

శ్రీకృష్ణుని జన్మాష్టమి పురస్కరించుకుని మూడవ రోజు బృందావనంలో యాదవులు ఉట్టి కోట్టి సంబరాలు నిర్వహిస్తారు. పర్లాకిమిడిలో సాయంత్రం శ్రీకరణం వీధి రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణుని తిరువీధిలో విహారంచినప్పుడు అనేక కూడళ్లలో ఉట్టెలు కోట్టి భక్తులు సందడి చేశారు. దీనిని చల్లపిడతల సంబరం అంటారు. రంగులు నీళ్లల్లో కలిపి పిడతలు కోట్టేవారిపై జల్లుతారు. చల్లపిడతలు కోట్టిన వారికి బహుమతి అందజేయడం అనవాయితీ. – పర్లాకిమిడి

• మూన్నాళ్ల ముచ్చటే!

• నిర్మించిన మూడు నెలలకే శిథిలమైన రోడ్డు


మాలిగుడ రోడ్డులో కూరుకుపోయిన ఆటోను బయటకు తీసుకున్న ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో దసమంతపూర్ పంచాయతీ నుంచి పి.మాలిగుడ గ్రామ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డును మూడు కోట్ల రూపాయలతో నిర్మించారు. అయితే రోడ్డు వేసిన కొంత కాలానికే తారు ఊడిపోయి గతుకల మయమైంది. రోడ్డు పరిస్థితి అధికారులకు తెలిపి మరమ్మతులు చేపట్టాలని ఎన్ని విజ్ఞప్తిలు చేసినా చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందమైందని ప్రజలు ఆరోపించారు. కొద్దిరోజులుగా పడుతున్న వర్షాలతో మూడు కిలో మీటర్ల రోడ్డు గుంతలుగా మారి బురద మయమైంది. దీంతో రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేక పోవటమేనని పి.మాలిగుడ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

• ఎవరైతే నాకేంటి?

• కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న రిమ్స్ అధికారి
• జాబ్‌చార్టును వదిలి అన్నింటా జోక్యం చేసుకుంటున్న అడ్మినిస్ట్రేటర్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రి అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదు. ఇటీవల కలెక్టర్ ఆరోగ్యశాఖపై ప్రత్యేక దృష్టి సారించి తరచూ ఆరోగ్య శాఖ, రిమ్స్ అధికారులకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. వాటికి రిమ్స్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ హాజరు కావాల్సి ఉండగా వారు ఇప్పటివరకు హాజరైన దాఖలాలు లేవు. ఇటువంటి సమావేశాలకు ఆర్‌ఎంఓలను, సీనియర్ వైద్యులను పంపిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు వీరు సరైన సమాధానాలు చెప్పలేకపోతున్నారు. ఇటీవల ఓ సమావేశానికి హాజరైన సీఎస్ ఆర్‌ఎంఓ హైబీపీతో తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. సమావేశం నుంచి మిగిలిన అధికారులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సమావేశానికి సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ ఎందుకు హాజరు కావడం లేదని, ఇకపై వారు కచ్చితంగా హాజరుకావాలని రిమ్స్ అధికారులకు స్పష్టం చేశారు. అయినా ఆ ఆదేశాలు అమలుకావడం లేదు.

అప్రకటిత ప్రొటోకాల్..

రిమ్స్‌లో అప్రకటిత ప్రోటోకాల్ కొన్ని నెలలుగా అమలవుతోంది. అడ్మినిస్ట్రేటర్ తన ఇంటి నుంచి బయలుదేరినప్పుడు ఆ విషయాన్ని రిమ్స్ సెక్యూరిటీ సూపర్‌వైజర్కు సమాచారం అందిస్తారు. ఆయన వస్తున్నారన్న సమాచారం అందగానే ప్రధాన గేటు వద్ద ఓ సెక్యూరిటీ గార్డ్, రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మరో సెక్యూరిటీ గార్డ్, మార్చురీ సమీపంలో ఇంకో సెక్యూరిటీ గార్డ్, సాయిరాం భోజనశాల వద్ద ఇద్దరు సెక్యూరిటీ కార్డులు ఉండి, ఆయన కారుకు పాదచారులు గానీ, ద్విచక్ర వాహనాలు కానీ, అంబులెన్సులు గానీ అడ్డురాకుండా చూడాలి. పాత ప్రసూతి వార్డు నుంచి సూపరింటెండెంట్ గది సమీపంలోని అడ్మినిస్ట్రేషన్ గది వరకు రోగులు గాని, వారి సహాయకులు గాని, రిమ్స్ ఉద్యోగులు గానీ అడ్డు రాకుండా చూసుకోవాలి. ఆయన గది వద్ద కూడా ఒక సెక్యూరిటీ గార్డు బయట ఉండాలి. ఎంతటి పని ఉన్నా ఏ స్థాయి వారైనా ఆయన్ను కలిసేందుకు వీలుండదని రిమ్స్‌లోని అన్ని వర్గాల వారు చెబుతున్నారు. అలాగే సూపరింటెండెంట్ గదికి అడ్మినిస్ట్రేటర్ వస్తే ఆ సమయంలో ఏ స్థాయి అధికారంలో ఉన్న ఉద్యోగైనా బయటకు వెళ్లిపోవాల్సిందే. లేనిపక్షంలో ఆయనే సదరు ఉద్యోగులను బయటికి వెళ్లాలని చెబుతుంటారు. ఇలా ఇప్పటికే పలువురికి అవమానం జరిగినట్లు సమాచారం. సూపరింటెండెంట్కు ఈయన చెప్పిందే వేదం కావడంతో అన్నీ తానై వ్యవహరిస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

మండిపడుతున్న వైద్యులు..

రిమ్స్‌లో రోగులకు కావాల్సిన సౌకర్యాలు సక్రమంగా అమలవుతున్నాయా? పారిశుద్ధ్యం పరిస్థితి ఏంటి? సెక్యూరిటీ గార్డులు పనితీరు తదితర అంశాలను అడ్మినిస్ట్రేటర్ పర్యవేక్షించాల్సి ఉంది. వీటిపై దృష్టి సారించకుండా సూపరింటెండెంట్ అధికారాలను సైతం తానే వినియోగించుకుంటూ వైద్యుల సమావేశాలకు హాజరవుతూ ఆదేశాలు జారీ చేస్తుండడంతో వైద్యులు తీవ్ర మనస్తాపంతో ఉన్నారు.. ఇటీవల కొందరు వైద్యులు సూపరింటెండెంట్‌ను కలిసి ఆయన సమావేశాలకు హాజరైతే తాము వచ్చేది లేదని తెగేసి చెప్పేసినట్లు సమాచారం. జిల్లా అధికారులు తక్షణం జోక్యం చేసుకొని పరిస్థితిని గాడిలో పెట్టాలని పలువురు వైద్యులు, రిమ్స్ సిబ్బంది కోరుతున్నారు.

22న ధర్మశాల మండల అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానం

భువనేశ్వర్: ధర్మశాల మండల అధ్యక్షుడు ప్రభాత్ బల్వంత్రాయ్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ఆమోదించారు. ఈ నెల 22న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. ఈ నెల 11వ తేదీన, మండలంలో చెందిన 38 మంది సర్పంచ్‌లు, సమితి సభ్యులు మండల అధ్యక్షుని వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం దాఖలు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన ఓ వ్యక్తి పుట్టిన రోజు సందర్భంగా అదే వీధికి చెందిన జోగి చందు, దేవాది లోహిత్‌లు కడుతుండగా విద్యుత్ వైర్లు తాకడంతో ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. ఇద్దరూ గాయపడటంతో వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా


పొలంలో బోల్తాపడిన ట్యాంకర్

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు సమీపంలో జాతీయ రహదారి వద్ద ఆదివారం వేకువజాము ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. కాకినాడ నుంచి పశ్చిమబెంగాల్ వైపు వెళ్తున్న ట్యాంకర్ టెక్కలి సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి అప్రోచ్ రోడ్డు మీదుగా సమీపంలో పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ జి.సూరిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

నగర కళింగ కోమటి సంఘ అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్

శ్రీకాకుళం : నగర కళింగ కోమటి సంఘ అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్ ఎంపికయ్యారు. గత 15 రోజులుగా అధ్యక్ష ఎంపికపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పదవి కోసం పలువురు పోటీ పడగా చివరికి కోరాడ హరిగోపాల్, ఊణ్న సర్వేశ్వరరావు, కోరాడ రమేష్ మధ్య పోటీ ఏర్పడింది. ఆదివారం కళింగ వైశ్య సంఘం సమావేశం నిర్వహించగా రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులు హాజరయ్యారు. ఆశావాహులంతా తమకే పదవి కావాలని పట్టుబట్టారు. కాగా, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు వీరి ముగ్గురితో ప్రత్యేకంగా సమావేశమై రాజీకుదర్చడంతో హరిగోపాల్‌ను నగర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సర్వేశ్వరరావు, రమేష్‌లకు సముచిత స్థానం కల్పిస్తామని హామీఇచ్చారు. హరిగోపాల్ ప్రస్తుతం వర్తక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంఘానికి ఇప్పటివరకు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు.

చెరువు కాదు.. పాఠశాలే..


వర్షపు నీటిలో నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా సమితిలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండిమా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే పాఠశాలకు ప్రధాన ఉపాధ్యాయుడు సెలవు ప్రకటిస్తున్నారు. గుండిమా ప్రభుత్వ పాఠశాలలో ఉన్నవి రెండే తరగతి గదులు. మధ్యాహ్న భోజన పథకం వంటశాల కూడా ఇప్పటి వరకూ లేదు. వర్షాల వల్ల మిడ్ డే మీల్ బడి పిల్లలకు అందించడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఆదనపు తరగతి గదులు, పైకప్పు మరమ్మతులు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు అనేక సార్లు జిల్లా ముఖ్యవిద్యాధికారి మాయాధర్ సాహుకు లేఖలు రాసినా ఫలితం లేకపోయిందని తెలియజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ మధుమిత తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు లక్ష్మీనారాయణ రోథో


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: స్థానిక పెద్దరాధాకాంత మఠంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం సాధారణ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సభకు లక్ష్మీనారాయణ రోథో అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేశారు. వయోవృద్ధుల సమస్యలు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌కు ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహిని అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రోథో అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ గౌరోహరి దాస్‌ను ఎమ్మెల్యే రూపేష దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి హరిమోహాన్ పట్నాయక్, విశ్రాంత ఉపాధ్యాయులు గౌరహరి పండా, ఇంజినీర్ రోథో, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజానికి నిజమే ప్రాణవాయువు


అవార్డులు స్వీకరిస్తున్న జర్నలిస్టులు కందుల శివశంకర్, సున్నపు చిన్నారావు

శ్రీకాకుళం కల్చరల్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థను జర్నలిజం అనేది ఫోర్త్ ఎస్టేట్‌గా నడిపిస్తోందని, అటువంటి జర్నలిజానికి నిజమే ప్రాణవాయువు కావాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ డాక్టర్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవో హోంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ 69వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సాక్షి బ్యూరో చీఫ్ కందుల శివశంకర్‌కు డీకే అవార్డు, జనదీపిక పత్రిక సంపాదకుడు సున్నపు చిన్నారావుకు శృంగారం ప్రసాద్ స్మారక అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీకే ట్రస్టు కార్యదర్శి దుప్పల రవీంద్రబాబు మాట్లాడుతూ ఎన్నో సేవలు అందించిన దుప్పల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఏటా ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు, అవార్డు జ్యూరీ సభ్యులు సురేష్‌బాబు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్, యూనియన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి నర్సింగరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొంచాడ రవిశంకర్, జి.శ్రీనివాసరావు, ఎంహెచ్ అవార్డు గ్రహీత గేదెల మాధవరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ జగదీష్, సనపల రమేష్, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్నేశ్వరరావు, సామ్నా నాయకులు చౌదరి సత్యనారాయణ, చైతన్య మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు మహారాణ, యోగి, నవీన్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సౌకర్యాలతో డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్


ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, పక్కనే డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రూపాంక్

అరసవల్లి : జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో అందరికీ అందుబాటులో సింహద్వారం ప్రధాన రహదారిలో మహిళలు, చిన్నారుల వైద్యం కోసం డాక్టర్ శ్రీధర్ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక మెడికవర్ ఆసుపత్రి పక్కన నూతనంగా నిర్మించిన డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు అత్యంత ప్రావీణ్యత ఉన్న వైద్యునిగా శ్రీధర్ గుర్తింపు పొందారని కొనియాడారు. శ్రీధర్ వంటి అనుభవజ్ఞులైన వైద్యులు ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్‌లో వైద్య సేవలను పరిచయం చేయడం జిల్లా ప్రజలకు శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, ఆయన కుమారుడు డాక్టర్ దానేటి రూపాంక్, భార్య దానేటి రాధ, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎచ్చెర్ల, నరసన్నపేట ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, అరకు మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కిమ్స్ అధినేత డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, మెడికవర్ గ్రూప్ ఈడీ హరికృష్ణ, ప్రముఖ వైద్యులు పి.జె.నాయుడు, గూడేన సోమేశ్వరరావు, కె.అమ్మన్నాయుడు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, టీడీపీ నేత మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.


• కిలోవాట్‌పై 50 శాతం రాయితీ
• డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు పెంపు
• సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

విద్యుత్ లోడ్.. క్రమబద్ధీకరణకు చాన్స్

హిరమండలం: గృహవిద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ మరో అవకాశం కల్పించింది. కిలో వాట్ విద్యుత్‌కు 50 శాతం రాయితీతో తగ్గించుకునేందుకు తొలుత మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అయినా వినియోగదారుల నుంచి అంతంత మాత్రమే స్పందన వచ్చింది. దీంతో డిసెంబర్ 31 వరకు గడువు పొడిగించింది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. వాస్తవానికి గృహ వినియోగదారుల్లో చాలా మంది సర్వీస్ పొందే సమయంలో తక్కువ లోడు సామర్థ్యంతో కనెక్షన్ పొందుతారు. తర్వాత ఇంట్లో గృహోపకరణాలు పెరిగే కొద్దీ విద్యుత్ వినియోగం, లోడ్ రెండూ పెరుగుతాయి. ఆ మేరకు విద్యుత్ లోడ్ పెంచుకోకుంటే ఆ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తలెత్తుతుంది. క్షేత్రస్థాయిలో సర్వీసులు, లోడ్ ఆధారంగానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుంటారు. లో ఓల్టేజీ సమస్య తలెత్తినా అక్కడ లోడ్ ఎంత ఉందనే అధికారిక లెక్కల ప్రకారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో వినియోగదారులంతా తప్పనిసరిగా గృహోపకరణాల మేరకు లోడ్ పెంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు

పెరుగుతున్న వినియోగం..

సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలో వాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2500 చొప్పున వసూలు చేస్తారు.


విద్యుత్ మీటర్

చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తున్నారు. వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది. ఇటువంటి వారంతా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

జరిమాన పడకుండా..

☛ ఇప్పటివరకు అధిక లోడ్ నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరుచూ ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుంతో పాటు జరిమానా వసూలు చేసేవారు.

రుసుము వివరాలు		
కిలో వాట్	సాధారణం	స్వచ్ఛందం
ఒకటి	రూ.2,250	రూ.1250
రెండు	రూ.4500	రూ.2500
మూడు	రూ.6750	రూ.3750

☛ జిల్లాలో సుమారు 6.71 లక్షలకు పైగా కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మంచి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్ వాడుతున్నారు.

☛ గత ఐదేళ్లుగా ప్రతి నెలా తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగులు తనిఖీ చేసి అధిక లోడ్ వినియోగిస్తున్న వారికి అపరాధ రుసుం విధిస్తున్నారు.

తీరనున్న లోఓల్టేజ్ సమస్య

గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో లైట్లు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడ్‌ను కిలోవాట్‌లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్ డెవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం గృహాలకైతే 1 నుంచి 2 కిలోవాట్‌లు, దుకాణాలకు 2 నుంచి 3 కిలోవాట్‌లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.

☛ ఇంటిలో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్ వినియోగం ఉంటుంది.

☛ వినియోగం అంచనాకు మించడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతో లోఓల్టేజ్ సమస్యలు పెరిగిపోతున్నాయి.

సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200


ప్రతి అదనపు కిలోవాట్‌కి సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ చార్జీ రూ.1500 ఉంటుంది. కిలోవాట్‌లు పెరిగే కొద్దీ ఈ రుసుం మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ గడువు డిసెంబర్ వరకు పొడిగించారు. కిలోవాట్ చొప్పున డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ లభిస్తుంది.

వినియోగించుకోవాలి..

విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అదనంగా వినియోగిస్తున్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. ఇలా చేసుకుంటే అదనపు రుసుములు , జరిమానా బెడద ఉండదు. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవు.

– జి.వి.ఎస్.ప్రసాదరావు, ఏడీఈ విద్యుత్ శాఖ, టెక్కలి డివిజనల్

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు.. తప్పిన ప్రాణాపాయం


బస్సు ఢీ కొట్టడంతో బోల్తా పడిన వ్యాన్


ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు

జి.సిగడాం: మెట్టవలస గ్రామ సమీపంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. రాజాం నుంచి చిలకపాలెం మీదుగా విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు, శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వెళ్తున్న పేపర్ వ్యాన్‌ను మెట్టవలస కూడలి వద్ద ఢీకొట్టింది. వ్యాన్‌తో పాటు అటుగా వస్తున్న కారును కూడా ఢీకొట్టింది. వ్యాన్ రోడ్డుపక్కనే ఉన్న ఓ టిఫిన్ దుకాణంలోకి వెళ్లి బోల్తా పడింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దుకాణం మాత్రం ధ్వంసమైపోయింది. ఎస్‌ఐ వై.మధుసూదనరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మధుసూధనరావు తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం రూరల్: మోపసుబందరు గ్రామంలో ఎక్సైజ్ ఎస్‌ఐ టి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా లాడి కామేశ్వరరావు 12 మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి పాన్‌షాపులో అధిక రేట్లకు అమ్ముతున్నట్లు గుర్తించి దాడులు నిర్వహించామని రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పల్లకిలో పెళ్లికూతురి ఊరేగింపు

• గ్రామాల్లో కొనసాగుతున్న సంప్రదాయం



వేపాడ-వల్లంపూడి గ్రామాల్లో పల్లకిలో పెళ్లికూతురిని ఊరేగిస్తున్న దృశ్యం

వేపాడ: పూర్వీకుల సంప్రదాయాలను పల్లెల్లో నేటికి ఆచరిస్తూ ఉండడంతో నేటి తరానికి సంప్రదాయాలు, ఆచారాలు తెలుస్తాయని పెద్దలు అంటున్నారు. వేపాడ మండలం వల్లంపూడి గ్రామంలో ఆదివారం జరిగిన వివాహం సందర్భంగా పెళ్లికూతురును వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో పల్లకిలో ఊరేగించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శ్రావణమాసంలో ఆఖరు ముహుర్తం కావడంతో పెద్దసంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. మరో 30రోజుల పాటు వివాహాలకు శూన్యమాసం రావడంతో ముహుర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

రెడ్డివానివలసలో కార్డన్‌సెర్చ్



తనిఖీల్లో భాగంగా పట్టుబడిన సారా

మెంటాడ: నాటుతుపాకుల ఏరివేతలో భాగంగా మెంటాడ మండలం కొండలింగాలవలస పంచాయతీ మధుర గ్రామం రెడ్డివానివలసలో సీఐ జీఏవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ -సెర్చ్ ఆపరేషన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సోదా చేశారు. సోదాల్లో భాగంగా 70లీటర్ల సారా, 1000 లీటర్ల మడ్డి కల్లు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. దీనికి సంబంధించి ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.సీతారాం తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రమేష్ మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రంలోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన గోర్జి రమేష్(44) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీరాంనగర్ కాలనీకి చెందిన రమేష్ కడుపునొప్పితో బాధపడుతున్నాడు.రోజూలాగానే పొలంలో పనిచేస్తుండగా కడుపులో నొప్పి రావడంతో ఈ నెల 15వ తేదీన గడ్డిమందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు బాడంగి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 16న రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

నాగావళి నదిలో వ్యక్తి గల్లంతు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆర్ గోపాలరావు



ఉరదండం పోలయ్య (ఫైల్)

సంతకవిటి: మండలంలోని పోడలి గ్రామానికి చెందిన ఉరదండం పోలయ్య(76) ఆదివారం నాగావళి నదిలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎప్పటిలాగానే ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు నాగావళి నదికి వెళ్లాడు. ఎప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో నది దగ్గరికి వెళ్లి చూడగా నది వద్ద దుప్పటి, చెప్పులు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.గోపాలరావు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. అలాగే సంఘటన స్థలాన్ని తహసీల్దార్ బి.సుదర్శనరావు ఆధ్వర్యంలో ఆర్‌ఐ కృపారావు, వీఆర్‌ఓ అన్నారావులు పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు వీలు లేకుండా నదిలో వరద ఉధృతి అధికంగా ఉండడంతో కలెక్టర్ దృష్టిలో పెట్టామని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం వచ్చిన వెంటనే గాలిస్తామని తెలిపారు. పోలయ్య అల్లుడు ఎ.చిన్నారావు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నేడు నేత్రవైద్యశిబిరం

రాజాం సిటీ: పట్టణంలోని ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో సేవలందిస్తారని పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారంతా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డుతో హాజరుకావాలని సూచించారు.

ఆటోమేటిక్ కష్టాలు

• ఎప్పటికప్పుడే వాహనాల తనిఖీ చేస్తున్న అధికారులు
• అటు రవాణా, ఇటు సివిల్ పోలీస్ అధికారులతో ఇబ్బందులు
• అవిలేవు..ఇవి లేవంటూ ఫైన్‌లు
• ఆందోళనలో డ్రైవర్లు



జీఓ 21 రద్దుచేయాలని సీఐటీయూతో కలిసి రాజాంలో డిమాండ్‌చేస్తున్న ఆటోయూనియన్ సభ్యులు(ఫైల్)

రాజాం: ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్లకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో ఏడాదికో, రెండేళ్లకు ఒకదఫా ఆటో డ్రైవర్లు, యజమానులు తమ ఆటోలను ఆర్‌టీఓ కార్యాలయం వద్ద తనిఖీలు చేయించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందేవారు. వాటికి తోడు గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా ప్రతి ఏడాది ఠంచన్‌గా రూ.10 వేల సాయం అందించేది. వీటితో ఆటోవాలాలు ఇన్సూరెన్స్, ట్యాక్స్ చెల్లించుకునేందుకు అనుకూలంగా ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సాయం కట్‌చేశారు. ఆటో డ్రైవర్లకు గత ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన జీఓలు, హామీలు అమలు కాలేదు. వాటికి తోడు అదనపు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. అధిక ఫైన్‌లు, కొర్రీలతో ఆటోలు రోడ్డెక్కాలంటే భయపడుతున్నాయి. ఇప్పుడు ఫ్రీ బస్సు వారిలో కొంతమంది పొట్టకొట్టే పరిస్థితి తెచ్చింది.

ఆ జీఓ ఎత్తివేత ఉత్తుత్తిదే

సార్వత్రిక ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు మహిళలకు ఫ్రీ బస్సు వల్ల ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు రాకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆటోలను తనిఖీచేసే జీఓ 21ను ఎత్తివేస్తామని, అవసరమైతే సవరిస్తామన్నారు. దీంతో పాటు ట్యాక్స్, ఇనూరెన్స్‌ల చెల్లింపుల్లో రాయితీ ఇస్తామని ప్రకటించారు. ఎటువంటి ఫైన్‌లు ఉండవని ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చారు. ఇప్పుడు ఈ జీఓ ఎత్తివేయకపోగా, కొత్త ఆంక్షలు మొదలయ్యాయి. రవాణా వాహనాల ఫిట్‌నెస్ టెస్టులకు సంబంధించి గత ప్రభుత్వమే నేరుగా నిర్వహించగా, ఇప్పుడు ఈ ప్రభుత్వం ఆటోమేటిక్ టెస్టింగ్ పేరుతో ప్రైవేట్ వారికి అప్పగించి, డ్రైవర్లపై అధిక భారం మోపడం ప్రారంభించింది. ప్రైవేట్ ఏజెన్సీల చేతిలోకి ఫిట్‌నెస్ టెస్టింగ్ వెళ్లడం ద్వారా రవాణా వ్యవస్థ తారుమారవుతుందని, ఇప్పటికే అధిక ట్యాక్స్‌లు, పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరల కారణంగా ఆటోలు నడపలేని పరిస్థితి ఎదురవుతోందని ఆటో కార్మికులు వాపోతున్నారు. గతంలో ఆటోవాలాకు ఫైన్ నిమిత్తం రూ. 200లు, రూ.300లు ఉండేది. ఇప్పుడు చిన్నపాటి తప్పులను చూపించి రూ.1000లకు మించి ఫైన్‌లు వేస్తున్నారని ఆటోవాలా వాపోతున్నాడు. కూటమి వచ్చిన తరువాత తమకు ట్యాక్స్, ఇన్సూరెన్స్ తప్పుతాయని అనుకుంటే ఇప్పుడు డబుల్, త్రిబుల్ అవడమే కాకుండా అదనపు కేసులు పెడుతున్నారని గగ్గోలు పెడుతున్నారు.



అధికభారం పడుతోందని వాపోతున్న డ్రైవర్లు

ఏదో ఒక నెపం

గతంలోకంటే ఇప్పుడు ఆటోవాలాకు విధిస్తున్న ఫైన్‌లు పెనుభారంగా మారాయి, ఆటోలు రోడ్డు మీద కనిపించినా, డ్రైవర్ సీటు పక్కన అదనంగా పాసింజర్లు ఉన్నా ఫైన్ పడుతుంది. ఇవి తనిఖీలు సమయంలో ఆటోవాలాకు తెలియడంలేదు. కొంత సమయం తర్వాత సెల్‌ఫోన్‌లకు మెస్సేజ్‌లు వస్తున్నాయి. దీంతో ఇదెక్కడి పరిస్థితిరా బాబూ అంటూ ఆటోడ్రైవర్లు మండిపడుతున్నారు. ఇటు రవాణా శాఖ అధికారులతో పాటు అటు పోలీసులతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. పార్కింగ్ పేరుతో అధిక ఫైన్‌లు పడుతుండడం శోచనీయం. మరో వైపు వాహన మిత్ర అందకపోవడం దురదృష్టకరంగా మారింది. రాజాం నియోజకవర్గంలో రాజాం నుంచి రేగిడి, వంగర, సంతకవిటి, చీపురుపల్లి, తెర్లాం, పొందూరు, జి.సిగడాం ఏరియాలకు ప్రతిరోజూ 1400 ఆటోలు తిరుతుంటాయి. వారందరికీ గతంలో వచ్చే వాహన మిత్ర అటకెక్కింది.



రేగిడి మండలంలో ఆటో ప్రయాణాల తనిఖీలో పోలీసులు(ఫైల్)

చాలా ఇబ్బందిగా ఉంది



గతంలో కంటే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. రోడ్డు ట్యాక్స్ పెంచారు. ఇన్సూరెన్స్ చార్జీలకు అదనంగా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. వాటితో పాటు పొల్యూషన్ చార్జీలు, ఇతర ఫైన్‌లు ఎక్కువగా ఉన్నాయి. గతంలో కంటే ఎక్కడికక్కడే వాహన చెకింగ్‌లు పెరిగిపోయాయి. పాత బకాయిలు అంటూ, మత్తు పదార్థాల రవాణా తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పేరుతో అధికారులు నిత్యం తనిఖీచేసి, ఆటోకు సంబంధించి ఏ చిన్న కాగితం లేకున్నా, ఎక్కువమంది ప్రయాణికులు ఉన్నా అపరాద రుసుం విధిస్తున్నారు. ఆటోతో రోడ్డు ఎక్కాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం జీఓ నంబర్ 21ని సవరిస్తామని చెప్పి, ఇంతవరకూ సవరించలేదు.

ఎన్. దుర్గారావు, అమ్మానవదుర్గ ఆటోయూనియన్ నాయకుడు, రాజాం

కష్టం ఎక్కువ..ఆదాయం తక్కువ



గతంలో ఆటోలు నడిపితే కుటుంబాన్ని అవలీలగా పోషించుకున వారం. ఇప్పుడు పరిస్థితి మారింది. పెద్దగా బేరాలు ఉండడంలేదు. లాంగ్ జర్నీ బేరాలు వస్తే హైవే ఎక్కాలంటే భయమేస్తోంది. ట్యాక్స్, ఇతర కాగితాలు పేరుతో ఫైన్‌లు పడుతున్నాయి. తనిఖీ అధికారులతో మాట్లాడినసమయంలో ఏమీ ఉండడంలేదు. అనంతరం సెల్ ఫోన్‌లకు మెస్సేజ్‌లు వస్తున్నాయి. రాంగ్ పార్కింగ్ అని, ఎక్కువ మంది ఉన్నారని ఇలా తప్పులు చూపిస్తున్నారు. వీటికి తోడు ట్యాక్స్, ఇన్సూరెన్స్ చెల్లింపులు పెరిగాయి. జీఓ నంబర్ 21లో సవరణ లేకపోవడంతో ఆటోలకు నిత్యం తనిఖీలు, ఇబ్బందులు పెరిగాయి.

వి. మజ్జిగౌరి, ఆటో డ్రైవర్, రాజాం

సమాజం అభివృద్ధికి జర్నలిస్టుల బాధ్యత కీలకం

• కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్
• ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 68వ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం గంటస్తంభం: సమాజంలో జరుగుతున్న మంచి, చెడును వెలికి తీసి అభివృద్ధికి దోహదపడే పవిత్ర వృత్తిలో జర్నలిజం కీలకంగా నిలుస్తుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 68వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్, ఏటీకే వ్యవస్థాపకుడు డా.ఖలీల్‌బాబా జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత స్వర్గీయ గురజాడ అప్పారావు, సర్ సీవైచింతామణి, మానుకొండ చలపతిరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, అయితే అందరూ ఏక తాటిపై నిలిచి ఒకే జాబితా ఇస్తే అర్హులందరికీ ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ నకిలీ జర్నలిస్టులను నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా వృత్తిలో ఉన్న జర్నలిస్టుల వాహనాలకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్టిక్కరింగ్ వ్యవస్థను సుమారు 15 నుంచి 20 రోజుల్లో తీసుకొస్తామన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ శివప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ జీవనానికి సరిపడ ఆదాయం లేనప్పటికీ జర్నలిజం వృత్తినే నమ్ముకున్న జర్నలిస్టు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

సీనియర్ జర్నలిస్టులకు సత్కారం

అనంతరం జిల్లాలో 25 ఏళ్లపాటు జర్నలిజం వృత్తిలో ఉన్న 40 మంది సంఘం సభ్యులను సంఘం జ్ఞాపికలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహాపాత్రో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎంఎస్ఎన్‌రాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పంచాది అప్పారావు, ఆరిపాక రాము, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు కేజే శర్మ, కార్యదర్శి సముద్రాల నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్, డేవిడ్ రాజు, చక్రవర్తి, వేదుల సత్యనారాయణ, జె.శేషగిరి, జయరాజ్, లింగాల నర్సింగరావు, మంత్రి ప్రగడ రవి, శంకరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

గంటేడ పాటల పుస్తక పరిచయం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

పార్వతీపురం: ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు రాసిన 'పాడుదమా స్వేచ్ఛా గీతం' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరునాయుడు రాసిన పాటల పుస్తకాన్ని పరిచయం చేస్తూ నేటివరకు ఆయన రాసిన పాటలను గుర్తుచేస్తూ వక్తలు ఉపన్యాసాలు ఇచ్చారు. ముందుగా పాయల మురళీకృష్ణ పుస్తక పరిచయం చేయగా పలువురు గంటేడ రాసిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రజల జీవన శైలిని ప్రజలకు ఉన్న ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి తెలియజేసిన గొప్ప సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు అని, 'స్నేహకళా సాహితి' పేరుతో సంస్థను స్థాపించి కళింగాంధ్ర ప్రాంతంలో ఎందరో యువ కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్నారని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీఆర్ కృష్ణాజీ హాజరు కాగా చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. దేశ గత చరిత్ర నెత్తిటి మరక పాటల సీడీని డాక్టర్ వెంకట్రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, గజల్ వినోద్, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, మేధావులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

లారీబోల్తా పడి క్లీనర్ మృతి

సాలూరు: లారీ బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో క్లీనర్ మృతిచెందాడు. సాలూరు మండలంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై రూరల్ ఎస్సై నర్సింహమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఆకేటి సన్యాసిరావు, మేడిశెట్టి వెంకటరమణలు లారీ డ్రైవర్, క్లీనర్‌లుగా పనిచేస్తున్నారు. మండలంలోని సీతందొరవలస నుంచి కర్రల లోడ్ వేసుకుని రాయగడ ఫ్యాక్టరీకి బయల్దేరారు. ఈ క్రమంలో సాలూరు వైపు వస్తుండగా ముగడవలస మలుపు వద్ద డ్రైవర్ లారీని నిర్లక్ష్యంగా, వేగంగా నడపడంతో లారీ బోల్తాపడగా క్లీనర్ వెంకటరమణ(37) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి తాతబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా

• ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం అర్బన్: జిల్లాలో క్షేత్రస్థాయిలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం నిఘా పెడుతూ విస్తృతంగా దాడులు చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్ట విరుద్ధ చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జూదం, కోడి-గొర్రె పందాలు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తరచూ పట్టుబడుతున్న నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లే-అవుట్లు, గ్రామ శివారు, నగర శివారు, తోటలు, పాడుబడిన భవనాల్లో జూదం ఆడుతున్న వారిపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో డ్రోన్ల సహాయం తీసుకుంటున్నామని వివరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి ముందుగానే సమాచారం సేకరించి దాడులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పేకాట విషయంలో 1,031 మందిపై 141 కేసులు నమోదు చేసి రూ.24,07,398 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడి పందాల విషయంలో 174 మందిపై 35 కేసులు, రూ.1,13,679 నగదు, 75 కోళ్లు, 4 పొట్టేళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెపారు. మహిళా పోలీసుల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి చట్టవిరుద్ధ కార్యక్రమాలలో పాల్గొనకూడదని అసాంఘిక కార్యకలాపాలపై ఏమైనా సమాచారం తెలిసినా స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100కు అందించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుంల్ జిందల్

తమ్ముడిని రక్షించి..అన్న అనంతలోకాలకు..

• నాగావళి నదిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి



పవన్‌కుమార్(ఫైల్)



బతికి బయటపడిన భార్గవ్‌సాయి

పాలకొండ రూరల్: బంధువుల ఇంట గృహప్రవేశానికి ఎంతో సంతోషంతో వచ్చిన ఓ కుటుంబంలో నాగావళి నది తీరని శోకం మిగిల్చింది. గ్రామంలో శుభకార్యం కావడంతో అంతా సందడిగా ఉండగా కొద్ది క్షణాల్లో తీవ్రవిషాదం గ్రామాన్ని నిశ్శబ్దంలోనికి నెట్టేసింది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నవంపాడు గ్రామానికి చెందిన ద్వారంపూడి రవి, వసంత దంపతులకు ఇద్దరు కుమారులు పవన్(16), భార్గవ్‌సాయి ఉన్నారు. ఆ కుటుంబం పాలకొండ మండలంలోని అన్నవరం గ్రామంలో వారి దగ్గర బంధువు పైడితల్లి, రామారావుల నూతన గృహ ప్రవేశానికి శనివారం వచ్చింది. ఆదివారం గృహప్రవేశం కావడంతో పవన్‌కుమార్ తమ్ముడు భార్గవ్‌తో పాటు బాబాయి సురేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలో ఉన్న నాగావళి తీరానికి ఉదయం 6.30గంటల సమయంలో వెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో బాబాయి బహిర్భూమికి వెళ్లగా భార్గవ్‌సాయి స్నానం చేసేందుకు నదిలో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడం, ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావంతో నదిలో నీటి ప్రవాహం అధికం కావడంతో మునిగి పోయాడు. ఈ విషయం గమనించిన పవన్‌కుమార్ తన తమ్ముడిని రక్షించేందుకు నదిలోకి దిగాడు. తమ్ముడిని ఒడ్డుకు చేర్చే యత్నం చేశాడు. తమ్ముడు మునిగిపోతున్నట్లు గట్టిగా అరవడంతో సమీపంలో ఉన్న బాబాయి భార్గవ్ సాయి రెక్క పట్టుకుని ఒడ్డుకు లాగాడు. ఇంతలో పవన్‌కుమార్ మునిగిపోయాడు. విషయం గుర్తించిన స్థానికులు తక్షణమే స్పందించి మునిగిపోయిన పవన్‌కుమార్‌ను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న పవన్‌కుమార్‌కు సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించేందుకు తీసుకు వెళ్లేయత్నం చేస్తుండగా మృతిచెందాడు.

విశాఖలో చదువుతున్న అన్నదమ్ములు

మృతుడి తండ్రి రవి భవన నిర్మాణ కార్మికుడిగా రెక్కల కష్టంతో కుమారులను విశాఖలో చదివిస్తున్నాడు. పవన్‌కుమార్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతుండగా రెండవ కుమారుడు 10వ తరగతి చదువుతున్నాడు. చేతికి అందివస్తున్న పెద్దకుమారుడు ఇలా ప్రమాదంలో మరణించడంతో భార్య వసంత, రవి గుండెలు పగిలేలా రోదించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎస్సై కె.ప్రయోగమూర్తి ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిపై ఆరా తీశారు. తల్లితండ్రులు కుమారుడి మృతదేహాన్ని వారి స్వగ్రామం తీసుకువెళ్లారు.

దోమకాటు.. ప్రాణాంతకం

• నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు

పార్వతీపురం రూరల్: ప్రతి వ్యాధికి ప్రస్తుత కాలంలో దోమకాటే మూల కారణమవుతుందని వైద్యులు, పరిశోధకులు చెబుతున్నారు. ఈ మేరకు దోమ ఎంత ప్రమాదకరమైందో, దోమలతో సోకే వ్యాధుల గురించి తెలుసుకుందాం. దోమకాటు చాలా ప్రమాదం. లేనిపోని రోగాలన్నీ దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలిపాయి.

దోమకాటుతో వచ్చే వ్యాధులు-లక్షణాలు

మలేరియా: ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది.

లక్షణాలు: చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం విడిచి విడిచి వస్తూ ఉంటుంది.

డెంగీ: పగటి సమయంలో కుట్టే ఏడిస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరల్ జ్వరంగా ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.



జిల్లా కేంద్రాస్పత్రి వెనుక భాగంలో సేదతీరుతున్న పందులు

లక్షణాలు: హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

చికున్ గున్యా: ఏడిస్ ఈజిప్ట్ దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లలో, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటాడు.

లక్షణాలు: తలనొప్పి, వాంతులు, వికారంతోపాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.

ఫైలేరియా: దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది. తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, వెన్ను పాము దగ్గర నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు, కాళ్లు, చేతులు, స్తనాలు, వరిబీజం, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

మెదడువాపు

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది.

లక్షణాలు: ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.



పార్వతీపురంలో బాలాజీనగర్ ప్రారంభంలో నీటి నిల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మంచిమార్గం.

• **దోమతెర:** రాత్రిలో పడుకునే ముందు దోమ తెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేలా దుస్తులు వేసుకోవాలి.

• **వేపనూనె:** వేపనూనె, కొబ్బరినూనెను 1:1 నిష్పత్తిలో తీసుకుని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి.

• **నిమ్మనూనె:** దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటిహాని ఉండదు.

• **కర్పూరం:** చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించి 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

నీటి నిల్వలతోనే ప్రమాదం



వారం పదిరోజుల వ్యవధిలో పరిసరాల్లో కాని, ఇంట్లో ఉన్న నీటి నిల్వల్లో మలేరియా దోమలు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది. ఎలాంటి పరిస్థితుల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. అలాగే ఇంట్లో ఉన్న కూలర్లు, చల్లదనం కోసం వాడే ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వాటి ద్వారా వచ్చిన నీటి నిలవ్వల్లో డెంగీదోమ వ్యాప్తి చెందుతుంది. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే 915 మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి, రెండవ విడతలో స్ప్రేయింగ్ ప్రక్రియ పూర్తి చేశాం. ప్రజలు జ్వరాలు బారిన పడినపుడు కచ్చితంగా నిర్లక్ష్యం వహించకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అనంతరం వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.

– డా.తెర్లి జగన్‌మోహన్‌రావు, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి